క్లుప్తంగా

బీజేపీ మండల అధ్యక్షుడిగా ప్రభాకర్



పలిమెల: బీజేపీ పలిమెల మండల అధ్యక్షుడిగా జనగామ ప్రభాకర్‌ను నియమించినట్లు మాజీ మండల అధ్యక్షుడు కోయాల్కర్ నిరంజన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన మాజీ మండల అధ్యక్షుడు నిరంజన్, మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ సునీల్ రెడ్డి, జిల్లా, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, పార్టీ నిర్దేశించిన పనులను పూర్తి స్థాయిలో నెరవేర్చడానికి కృషి చేస్తానన్నారు.

కాటారం మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్



కాటారం: బీజేపీ మల్హర్ మండల అధ్యక్షుడిగా పెద్దతూండ్ల గ్రామానికి చెందిన బండ శ్రీకాంత్ పటేల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆందోళన చెందవద్దు

కాటారం: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ద్వారా రేషన్‌కార్డుల మంజూరు చేయడం జరుగుతుందని ఆందోళన చెందవద్దని యూత్ కాంగ్రెస్ మంథని నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్ అన్నారు. కాటారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల విడుదలైన లిస్ట్‌లో పేరులేని వారు అయోమయానికి గురికావద్దని రేషన్‌కార్డు దరఖాస్తు స్వీకరణ, మంజూరు నిరంతరం కొనసాగే ప్రక్రియ అన్నారు. అర్హులైన వారు గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నియామకం



చిట్యాల: తెలంగాణ ప్రదేశ్ ఎరుకుల సంఘం చిట్యాల యూత్ అధ్యక్షుడిగా దుగ్యాల సురేశ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు దుగ్యాల స్వామి సోమవారం తెలిపారు. ఈ మేరకు నియామక పత్రం అందజేశారు. ఎరుకల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం సురేశ్ మాట్లాడుతూ.. యూత్ అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదానం



భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీలోని అమృత వర్షిణి వృద్ధాశ్రమంలో గోమతి-రమేష్ దంపతుల కుమారుడు తరాల శ్రీతన్‌నంద పుట్టినరోజు సందర్భంగా సోమవారం అన్నదానంతో పాటు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు కుసుమ శ్యామ్ ప్రసాద్, ఆత్మీయత సేవా సొసైటీ అధ్యక్షుడు బయ్యన మహేందర్ ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన సల్ల వసుమతి ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. బాధితురాలు కాళేశ్వరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై తమాషారెడ్డి ప్రత్యేక పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ రికవరీ చేసి ఆమెకు సోమవారం ఎస్సై, కానిస్టేబుల్ రమేశ్ అందజేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



కాళేశ్వరం: నేరాలకు, గ్రూపు తగాదాలకు పాల్పడవద్దని శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను ఎస్సై జి.తమాషారెడ్డి హెచ్చరించారు. కాళేశ్వరం పోలీసుస్టేషన్‌లో రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తులకు సోమవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాలకు పాల్పడితే, చట్టం ప్రకారం జీవితాంతం జైలులోనే గడపాల్సి వస్తుందన్నారు. నేర ప్రవృత్తిని వదిలించుకుని, కుటుంబ సభ్యులతో మంచి జీవనాన్ని ఏర్పరచుకోవాలన్నారు. రౌడీషీటర్లు తాత్కాలిక ఆనందాలకు నేరస్తులుగా మారవద్దన్నారు. మీ కార్యకలాపాలపై నిఘా ఉంచుతుందని హెచ్చరించారు.

పేరుకే క్రీడా ప్రాంగణాలు



ద్వారకపేట శివారులో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం



ఆరెపల్లి పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం బోర్డు

- మొక్కుబడిగా ఏర్పాటు
- కేవలం బోర్డులకే పరిమితం

టేకుమట్ల: గత రాష్ట్ర ప్రభుత్వం పల్లెల్లోని క్రీడాకారులకు క్రీడానైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో ఏర్పాటు చేసింది. మండలంలో మొత్తం 24 గ్రామ పంచాయతీలు ఉండగా కొన్ని గ్రామ పంచాయతీల్లో మాత్రమే క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తూ క్రీడా పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మరికొన్ని గ్రామాల్లో మాత్రం పాఠశాల మైదానంలోనే క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి బోర్డులను పెట్టారు. మైదాన విస్తీర్ణాన్ని మేరకు ఒక్కో గ్రామంలోని క్రీడా మైదానానికి రూ.1లక్ష నుంచి రూ.3లక్షల వరకు వెచ్చించి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూమి లేక చిన్నపాటి స్థలంలో కూడా బోర్డులు ఏర్పాటు చేసి క్రీడా ప్రాంగణాలుగా ఏర్పాటు చేశారు.

వినియోగంలోకి రాని క్రీడాప్రాంగణాలు

మండలంలోని అన్ని గ్రామాల్లో ఎక్కడా క్రీడా ప్రాంగణాలు వినియోగంలోకి వచ్చిన దాఖలాలు లేవు. గర్మిళ్లపల్లి శివారు కలికోటపల్లి పల్లె ప్రకృతి వనం సమీపంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం మాత్ర మే ఆటలాడుకునేందుకు సిద్ధం చేశారు. ఇక చాలా గ్రామాల్లో మొక్కుబడిగా క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కనీసం ఆటలాడుకునేందుకు నేల చదును చేయకుండానే బోర్డులను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. దాంతో రెండు సంవత్సరాలుగా గ్రామాల్లోని అన్ని క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగానే మిగిలిపోయాయి.

పాఠశాలల్లోనే క్రీడాప్రాంగణాలు..

మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూమి లేదనే కారణంతో పాఠశాల ప్రాంగణంలోనే క్రీడా ప్రాంగణం అనే బోర్డులను ఏర్పాటు చేసి బిల్లులు కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి. క్రీడా ప్రాంగణాల్లో ఖోఖో, షటిల్, వాలీబాల్ కోర్టు, వ్యాయామం బార్లు ఏర్పాటు చేయగా ఇప్పటి వరకు మండలంలోని ఏ గ్రామంలో క్రీడాకారులకు పూర్తి స్థాయిలో అందుబాటులో తెచ్చిన దాఖాలాలు లేవు. కేవలం బోర్డులు ఏర్పాటు చేసి క్రీడా ప్రాంగణాలుగా చూపించిన గ్రామాలు ఎన్నో ఉన్నాయి.

నిధులు నీళ్లపాలు..

క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేసినా ఎక్కడా వినియోగంలోకి రాకపోవడంతో క్రీడా మైదానాల కోసం వెచ్చించిన నిధులు నీళ్లపాలు అయ్యాయని పలువురు చర్చించుకుంటున్నారు. కనీసం చేసిన ఖర్చులకు సరైన క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకువస్తే గ్రామీణ క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని క్రీడాకారులు తెలుపుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు ఉపయోగపడేలా క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేస్తున్నారని తెలిసి ఎంతో ఊహించాం. కానీ క్రీడా ప్రాంగణాలు ఎక్కడా వినియోగంలోకి తేకపోవడంతో క్రీడాకారులు నిరుత్సాహంలో ఉన్నారు. కొన్ని చోట్ల పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయడంతో పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి. సరైన సదుపాయాలను కూడా ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలి.

\- తుమ్మల ఐలయ్య, రాష్ట్రస్థాయి క్రీడాకారుడు, టేకుమట్ల

కనీస సౌకర్యాలు లేవు..



క్రీడాకారుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో కనీస సౌకర్యాలు లేవు. పేరుకే క్రీడా ప్రాంగణాలు కానీ వినియోగంలోకి మాత్రం ఇప్పటి వరకు తీసుకురాలేదు. పాఠశాలల్లో కాకుండా ప్రత్యేక స్థలంలో ఆట స్థలాలను ఏర్పాటు చేసి, సౌకర్యాలు కల్పిస్తే క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుంది. కానీ ప్రస్తుతం క్రీడా ప్రాంగణాలు అలా లేవు.

\- మారెపెల్లి రాణాప్రతాప్, రాష్ట్రస్థాయి క్రీడాకారుడు, వెలిశాల

కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



భూపాలపల్లి రూరల్: దీక్షల్లో కూర్చున్న కార్మికులు



గణపురంలో..

- విద్యుత్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్‌రావు

గణపురం: విద్యుత్ ఆర్టిజన్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని విద్యుత్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్‌రావు అన్నారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల జయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు మండలంలోని చెల్పూరు కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రధాన గేటు ఎదుట ఆర్టిజన్ కార్మికులు సోమవారం నిరవధిక రిలే నిరహార దీక్షలను ప్రారంభించారు. కేటీపీపీ జేఏసీ చైర్మన్ అల్లం ఓదెలు, కన్వీనర్ బీరెల్లి రాజుల ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలను రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఈశ్వర్ రావు ప్రారంభించి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు ఆర్టిజన్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. బీఎంఎస్ కేటీపీపీ రిజనల్ అధ్యక్షుడు కొండా శ్రీనివాస్, సంఘాల నాయకులు చిలువేరు మల్లయ్య, కోల శ్యాం దీక్షకు మద్దతు తెలుపగా వందలాది మంది కార్మికులు సంఘీభావం ప్రకటించారు.

భూపాలపల్లి రూరల్: ఆర్టిజన్ కార్మికులను విద్యా అర్హతలను అనుగుణంగా కన్వర్షన్ చేయాలని విద్యుత్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా జేఏసీ చైర్మన్ తిప్పారపు రాజు కన్వీనర్, మోత్కూరి కోటిల ఆధ్వర్యంలో డివిజన్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ రిలే నిరాహార దీక్షలకు ముఖ్య అతిథిగా ఈశ్వర్ రావు హాజరై ప్రారంభించి మాట్లాడారు. శాంతియుతంగా ఈనెల 24 వరకు ఐదు రోజులపాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ, జిల్లా నాయకులు రాజయ్య, భాస్కర్, రాజేందర్, స్వామి, కృష్ణమూర్తి, విజేందర్, మధు, పూర్ణ, అశోక్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

రేగొండ: కొత్తపల్లిగోరి మండలంలోని సుల్తాన్‌పూర్‌లో నేడు (మంగళవారం) నిర్వహిస్తున్న గ్రామసభకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

శృంగేరి పీఠాధిపతికి ఆహ్వానం



స్వామివారికి చిత్రపటం ఇస్తున్న అధికారులు

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో కుంభాభిషేకం నిర్వహణ, మే నెల 15 నుంచి 26 వరకు జరుగు సరస్వతినది పుష్కరాలకు రావాలని శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతి తీర్థస్వామిని దేవాదాయశాఖ, కాళేశ్వరం దేవస్థానం అధికారులు, అర్చకులు ఆహ్వానించారు. సోమవారం దేవాదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో కర్ణాటక రాష్ట్రం బళ్లారిలోని శృంగేరి పీఠంకు దేవాదాయశాఖ ఆర్జేసీ రామృకృష్ణరావు, ప్రత్యేక ఆహ్వానితుడు గోవిందహరి, కాళేశ్వరం దేవస్థానం ఈఓ ఏ.మారుతి, ఉపప్రధాన అర్చకులు ఫణీంద్ర శర్మ, వేదపండితుడు సుబ్రహ్మణ్యశర్మలు తరలి వెళ్లారు. అక్కడ మఠంలో స్వామివారికి ఆహ్వానం అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. స్వామివారికి ఆలయ చిత్రపటం, పట్టువస్త్రాలు అందజేశారు. ఆయన వారికి తీర్థప్రసాదం అందజేసి ఆశీర్వచనం చేశారు. వారి వెంట ఆలయ సూరింటెండెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



మొగుళ్లపల్లి: నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



మహాముత్తారంలో..

మొగుళ్లపల్లి: తుక్కుగుడలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై దాడిని నిరసిస్తూ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణలో కుల, మత ప్రస్తావన లేకుండా సామరస్య పూరిత వాతావరణం ఉండేలా చూడాలని కోరారు. దాడి చేసిన వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పింగిళి విజయపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పోలు నాగరాజు, ఉపాధ్యాయులు బోయిని కుమారస్వామి, రాజయ్య, సురేందర్, రాజు, చందర్, భాగ్య, శ్రీ,లలిత తదితరులు ఉన్నారు.

కాటారం: తుక్కగూడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడిని నిరసిస్తూ సోమవారం కాటారం ప్రభుత్వ పాఠశాల, మహాముత్తారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి దాడిని ఖండించారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ మహాముత్తారం మండల అధ్యక్షుడు జాటోత్ రామ్ సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో గాయని మధుప్రియ సందడి



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని కాళేశ్వరం దేవస్థానంలో గాయని మధుప్రియ సందడి చేసింది. సోమవారం ఆమె మహాశివరాత్రి సందర్భంగా ఓ పాట చిత్రీకరణలో భాగంగా షూటింగ్‌లో పాల్గొంది. శివుడిపై పాట చిత్రీకరణ నిర్వహించారు. దీంతో ఆమెను చూసేందుకు దేవస్థానం సిబ్బందితో పాటు పలువురు భక్తులు ఎగబడ్డారు.

బీజేపీపై కాంగ్రెస్ నాయకుల దుష్ప్రచారం

- మాజీ ఎమ్మెల్సీ కాటపల్లి జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న జనార్దన్ రెడ్డి

భూపాలపల్లి రూరల్: భారత రాజ్యాంగంపై బీజేపీ చిత్తశుద్ధితో ఉందని కాంగ్రెస్ నాయకులు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ కాటపల్లి జనార్దరెడ్డి అన్నారు. సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకుడు లింగంపల్లి ప్రసాద్‌రావు అధ్యక్షతన సంవిధాన్, గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల అధ్యక్షులతో, ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని అనుచరించి పని చేస్తుందన్నారు. భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యాంగం విశిష్టతను పౌరులందరికీ తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ప్రతీ గ్రామంలో సంవిధాన్, గౌరవ్ అభియాన్ సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జన్నె మొగిలి, బట్టు రవి, దొంగల రాజేందర్, సయ్యద్ గాలిఫ్, దెరెట్టి గోపాల్, విప్లవ్ కుమార్, ఊరటి మునేందర్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో నాణ్యమైన విద్య

టేకుమట్ల: చిట్యాల మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నాణ్యమైన విద్య లభిస్తుందని టేకుమట్ల మండల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ మేకల రమేశ్ సూచించారు. సోమవారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని అంకుషాపూర్, సోమనపల్లి, సుబ్బక్కపల్లి, పంగిడిపల్లి, రామకిష్టాపూర్(టి) ప్రాథమిక పాఠశాలల్లో మోడల్ స్కూల్ విద్యపై అవగాహన కల్పించారు. 2025–26 విద్యా సంవత్సరానికి మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో జేఈఈ, ఐఐటీ, నీట్, ఒకేషనల్ తరగతులు నిర్వహిస్తారని అన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనంతో పాటు, పాటు బస్ సౌకర్యం ఉందన్నారు. ప్రవేశాల కోసం ఫిబ్రవరి 28లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖలీంపాషా, రాజు, పుల్ల రాజు, మోరె సాగర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రేగొండ: సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ రవి



చిట్యాలలో..

- ఆర్డీఓ రవి

రేగొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా క్షేత్ర స్థాయిలో సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ రవి అన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలపై మండలంలోని పోచంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను సోమవారం ఆర్డీఓ పరిశీలించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, సర్వేలో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఏఓ వాసుదేవారెడ్డి, ఏఈఓ ప్రవళిక, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.

చిట్యాల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలపై గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో సర్వేను నిర్వహించాలని భూపాలపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.రవి కోరారు. సోమవారం మండలంలోని ఒడితల గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హేమ, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, ఆర్ఐ రాజు, ఏఈఓ రమణకుమార్, పంచాయతీ కార్యదర్శి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

హైవే భూముల పరిశీలన

మొగుళ్లపల్లి: మండలంలోని రంగాపురం, మేదరమెట్ల గ్రామాల్లో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణానికి సేకరించనున్న భూములను ఆర్డీఓ రవి సోమవారం పరిశీలించారు. గ్రామాల్లో చేపడుతున్న సర్వే వివరాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ సునీత, ఆర్ఐ సురేందర్ రెడ్డి, వ్యవసాయాధికారి సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీఓ వీరస్వామి

- ఎంపీఓ వీరస్వామి

కాటారం: అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఎంపీఓ వీరస్వామి హెచ్చరించారు. మండలంలోని రేగులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని గంగారం క్రాస్ వద్ద కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను సోమవారం ఎంపీఓ పరిశీలించారు. అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు చేపడితే ఊరుకునేది లేదని నిర్మాణదారులను హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ద్వారా అనుమతి పొందిన తర్వాతనే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నిబంధనలను కాదని నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎంపీఓ వెంట పంచాయతీ కార్యదర్శులు కృష్ణవేణి, బీరెల్లి కరుణాకర్ తదితరులు ఉన్నారు.

దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం



భోజనాన్ని వడ్డిస్తున్న ప్రిన్సిపాల్, దాతలు

మల్హర్: మండలంలోని తాడిచర్ల జూనియర్ కళాశాల విద్యార్థులకు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ విజయదేవి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ మాట్లాడుతూ.. మండలంలోని మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాలు, అసోసియేషన్ సభ్యులు, వివిధ ట్రస్ట్ సభ్యులు తదితర దాతలు సేవదృక్పథంతో వచ్చి ఈ కార్యక్రమానికి సహకారం అందిస్తున్నారని తెలిపారు. మార్చిలో జరగబోయే పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడానికి, విద్యార్థుల్లో హాజరు శాతం పెంచడానికి ఈ మధ్యాహ్న భోజనం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో దాతలు అశోక్, కట్టే కోళ్ల కుమార్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్



మాట్లాడుతున్న విక్రాంత్

వాజేడు: రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెడుతున్న ప్రతీ పథకాన్ని పేదలకు అందేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్ల పూడి విక్రాంత్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం విలేకర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను ఇప్పిస్తామని చెప్పి పేదల వద్ద కొందరు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి దళారులను పేద ప్రజలు నమ్మవద్దని కోరారు. ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలను అధికారులు సర్వేలు, ఇతర అంశాలను సేకరించి గ్రామ సభలను నిర్వహించి ఎంపికైన లబ్ధిదారులు ప్రభుత్వానికి నివేదిక రూపంలో పంపిస్తారని తెలిపారు. అలాంటప్పుడు దళారులు డబ్బులు ఇస్తే పథకాలు రాక పోగా ప్రజలు నష్టపోయే అవకాశం ఎక్కువగా ఉందని ఏ ఒక్కరు కూడా అలాంటి వారిని నమ్మవద్దని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు దంతులూరి విశ్వనాథ ప్రసాద రాజు, దుర్గారావు, ఖాజావలి, ఎల్లయ్య, మడకం భీమయ్య, కాకర్ల పూడి సాయి కల్యాణ్, చిక్కుడు వెంకటేశ్వర్లు, సుధీర్ ఉన్నారు.

మారోజు వీరన్న జయంతి వేడుకలు



నినాదాలు చేస్తున్న నాయకులు

రేగొండ: మండలంలోని అమరావతి నగర్ కాలనీలో కామ్రేడ్ మారోజు వీరన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీయూఎస్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకన్న మాట్లాడుతూ.. సబ్బండ కులాలకు రాజ్యాధికారం కావాలని వీరన్న అలుపెరగని ఉద్యమాలు చేశారని కొనియాడారు. ఈ నెల 31న జిల్లాలోని ఆజంనగర్‌లో వీరన్న జయంతి వేడుకల ముగింపు సభను నిర్వహిస్తామని, ఈ సభకు కవులు, కళాకారులు, ఉద్యమకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీయూఎస్ఐ భూపాలపల్లి, ములుగు జిల్లాల కార్యదర్శి వావిలాల లక్ష్మణ్, వరంగల్ జిల్లా కార్యదర్శి గడ్డం శరత్, నాయకులు పిట్టల రాజమౌళి, గోవిందు రవి, గడ్డం ప్రశాంత్, గడ్డం పశుపతి, గడ్డం సమ్మయ్య పాల్గొన్నారు.